క్లుప్తంగా

ట్రాన్స్‌జెండర్‌లపై వివక్షత తగదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీవీ సాగర్

మేదరమెట్ల: ట్రాన్స్ జెండర్‌ల పట్ల వివక్షత చూపడం మానుకోవాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ మేదరమెట్ల ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్ అన్నారు. అంతర్జాతీయ ట్రాన్స్‌జెండర్‌ల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మేదరమెట్ల హెల్ప్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ సమాజంలో ట్రాన్స్‌జెండర్లు అనేక రకాలుగా వివక్షతను ఎదుర్కొంటున్నారన్నారు. అలాంటి వారిపట్ల చిన్నచూపు చూడటం అందరూ మానుకోవాలని, వారిని కూడా మనతో సమానంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ కోటేశ్వరరావు, ఎంఈఏటీ అనిల్‌కుమార్, వర్కర్స్ దుర్గా, మల్లేశ్వరి, కృష్ణవేణి, సామ్రాజ్యం తదితరులు ఉన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్టు

అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, చైత్ర మాసం, భరణి నక్షత్రం, చవితి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు సోమవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తేకోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈసందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

దానగుణానికి ప్రతీక రంజాన్

- ప్రేమకు ప్రతీకగా ఈద్ ఉల్ ఫితర్
- గ్రామాల్లో రంజాన్ ప్రార్థనలు
- సందడి చేసిన చిన్నారులు
- పేదలకు దానం చేసిన ముస్లింలు



వేటపాలెంలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయిస్తున్న మత పెద్ద



అద్దంకిలోని ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు



మార్టూరులో ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



అద్దంకిలో నమాజ్ చేస్తున్న చిన్నారులు

కారంచేడు/యద్దనపూడి/మార్టూరు/చినగంజాం: ఎదుటి వ్యక్తిని ప్రేమించడంతో పాటు, పొరుగువారిపై దయ కలిగి ఉండాలని.. అక్కరలో ఉన్నవారిని ఆదుకోవాలని అలాంటి ప్రేమకు ప్రతీకగా ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) పండుగ సారాంశమని ముస్లిం మత పెద్దలు బోధించారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని సోమవారం మండలంలోని కారంచేడు, దగ్గుబాడు, ఆదిపూడి, కుంకలమర్రు, కొడవలివారిపాలెం, స్వర్ణ గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలు ప్రేమకు ప్రతీకగా పలు బోధనలు చేశారు. ప్రతి ఒక్కరూ ఎదుటివారిని ప్రేమించాలని, పేద ప్రజలకు ఆహారం పెడుతూ వారిని ఆదుకోవాలని సూచించారు. 40 రోజుల ప్రత్యేక ఉపవాస దీక్షలను విరమించుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పేద ప్రజలకు అన్నదానాలు నిర్వహించారు.

■ యద్దనపూడి మండంలో రంజాన్ మాసం కఠిక ఉపవాసదీక్షను ముగించుకొని ముస్లింలు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి మసీదులు, ఈద్గాలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని పూనూరు, గన్నవరం, యద్దనపూడి, పోలూరు, జాగర్లమూడి, అనంతవరం గ్రామాల్లో ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

■ మార్టూరు మండల కేంద్రం మార్టూరు వలపర్ల, బబ్బేపల్లి, చిమ్మిరిబండ, కోనంకి తదితర గ్రామాలలో ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొనగా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఘుమఘుమలాడిన వంటకాలు..

చీరాల/చీరాలరూరల్/చీరాలటౌన్/చీరాలఅర్బన్/వేటపాలెం: నియోజకవర్గంలో రంజాన్ పండుగలను వైభవంగా జరుపుకున్నారు. రంజాన్ అనగానే మనకు ప్రత్యేక వంటకాలు గుర్తొస్తాయి. చికెన్, మటన్ హలీమ్ తదితర మాంసం వంటకాలు చేసుకొని ఇంటిల్లిపాది ఆనందంగా ఆరగించారు. అంతేకాకుండా వారు పేదలకు అన్నదానం చేశారు. వేటపాలెం స్థానిక పంచాయతీ కార్యాలయం దగ్గరలో గల ఈద్గా వద్దకు ముస్లింలు చేరుకుని సామూహిక ప్రత్యేక పార్థలు చేశారు. జామియా మసీదు (పెద్ద మసీదు)లో, తెలుగు విశ్వాసుల దైవ ప్రార్థన మందిరం, చినబజార్‌లోని మసీదు, కుందేరు రోడ్డులోని మసీదు, రావూరిపేట శివారు మసీదు, రామనగర్ మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

■ చీరాల నవాబుపేట ఈద్గా వద్ద ప్రత్యేక నమాజు కార్యక్రమాన్ని మత పెద్దలు నిర్వహించారు. ఈ సందర్భంగా మతపెద్ద తన సందేశంలో ప్రతి ముస్లిం అల్లా చూపించిన మార్గంలో పయనించాలని, రంజాన్ ఉపవాస దీక్షలు చేసిన ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల ప్రేమతో మెలగాలన్నారు. నమాజుకు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొని నియోజకవర్గంలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఈపురుపాలెంలోని మసీదులో ప్రత్యేక నమాజు నిర్వహించగా గ్రామంలోని ముస్లింలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

■ ఇంకొల్లు మండలంలోని ఇంకొల్లు, పావులూరు, బూదవాడ, ఇడుపులపాడు, నాగండ్ల, కొణికి, పూసపాడు అడ్డరోడ్డు వద్ద ఉన్న ముస్లింలు అత్యంత ఘనంగా పండుగను నిర్వహించారు. ఇంకొల్లు గ్రామంలోని ఈద్గా వద్దకు గ్రామంలోని ముస్లింలు అల్లా నామ స్మరణతో ఊరేగింపుగా వెళ్లి ప్రార్థనలు చేశారు.

ఈద్గాలు, మసీదులకు పోటెత్తున్న ముస్లింలు

అద్దంకి/అద్దంకిరూరల్/బల్లికురవ/జే.పంగులూరు/మేదరమెట్ల: నెలరోజులపాటు కఠోర నియమాలతో ఉపవాసాల అనంతరం ముస్లింలు రంజాన్ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అద్దంకి పట్టణం, మండలంలోని అన్ని గ్రామాల్లోని ముస్లింలు ఉదయాన్నే ఈద్గాలు, మసీదుల వద్దకు చేసుకుని ప్రత్యేక నవాజ్‌ను చేపట్టారు. మత గురువులు ప్రబోధించే వాక్యాలను శ్రద్ధతో విన్నారు. అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులోని ఈద్గా వద్దకు అధిక సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు.

■ కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల ఈద్గా వద్దకు ముస్లింలు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దలను గుర్తుకు తెచ్చుకుంటూ దానధర్మాలు చేశారు.

■ **జే.పంగులూరు:** మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ పండగ చేసుకున్నారు. రంజాన్ సందర్భంగా పంగులూరు గ్రామంలో నూతన దర్గా, అలవలపాడు, రామకూరు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన దర్గా వద్ద రంజాన్ ప్రార్థనలు చేశారు. చిన్నమల్లవరంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

■ చినగంజాం మండలంలోని చినగంజాం, పెదగంజాం, కడవకుదురు, గొనసపూడి, చింతగుంపల గ్రామాలలోని ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ముస్లింలు ర్యాలీగా చినగంజాంలోని ఈద్గా వద్దకు ఊరేగింపుగా అల్లా నామ స్మరణ చేసుకుంటూ వందల సంఖ్యలోతరలి వెళ్లారు.

■ క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పర్వదినమని కొణిదెన ఇమాం రజాఖాన్ అన్నారు. బల్లికురవ మండలంలోని కొణిదెన వల్లాపల్లి, చెన్నుపల్లి, బల్లికురవ, గుంటుపల్లి, అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, వైదన, కొప్పరపాడు, కోటావారిపాలెం గ్రామాల్లో మసీదులను ఈద్గాలను ప్రత్యేకంగా అలంకరించి ఇమామ్‌లు, ముజావర్ల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.

■ పర్చూరు మండలంలోని ఉప్పుటూరు, నాగులపాలెం, నూతలపాడు, చెరుకూరు, పర్చూరు గ్రామాలలోని ముస్లింలు రంజాన్ పండుగను వైభవంగా నిర్వహించుకున్నారు. పర్చూరులో ముస్లింలు మార్కెట్ యార్డులో నిర్వహించిన సామూహిక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఇమాన్‌లు అల్లా బోధనలు వినిపించారు.



బల్లికురవలో బోధనలు వింటున్న ముస్లింలు



చిగంజాంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం మత పెద్ద



పర్చూరులో బోధనలు చేస్తున్న మతపెద్ద



పంగులూరులో ముస్లింలు నిర్వహిస్తున్న రంజాన్ ప్రార్థనలు



ప్రత్యేక నమాజులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య



మేదరమెట్ల ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వేటపాలెంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



దగ్గుబాడులో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు

పిచ్చమ్మకు నివాళులర్పించిన నాయకులు



పిచ్చమ్మ దశదిన కర్మకు హాజరై వైవీ భద్రారెడ్డిని పరామర్శిస్తున్న హనిమిరెడ్డి



పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి



పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

పర్చూరు (చినగంజాం): రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తల్లి యర్రం పిచ్చమ్మ దశదిన కర్మకు పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్‌రెడ్డి సోమవారం హాజరయ్యారు. వైవీ సుబ్బారెడ్డితో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. చినగంజాం మండలానికి చెందిన పాదర్తి ప్రకాష్, సుబ్బారెడ్డి, ఏడుకొండలు రెడ్డి, ఎం సునీల్, ఉమాశంకర్ రెడ్డి, సూర్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

నివాళులర్పించిన హనిమిరెడ్డి..

మేదరమెట్ల: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి యర్రం పిచ్చమ్మ దశదిన కర్మ సోమవారం ఒంగోలులో జరిగింది. కార్యక్రమానికి అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి హాజరై పిచ్చమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. అలాగే ఎంపీ సోదరుడు వైవీ భద్రారెడ్డిని కలసిన ఆయన పరామర్శించారు. హనిమిరెడ్డి వెంట నియోజకవర్గ నాయకులు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

పిచ్చమ్మ దశదిన కర్మకు హాజరైన హనిమిరెడ్డి

చీరాల: వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి యర్రం పిచ్చమ్మ దశదిన కర్మకు చీరాల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ హాజరై ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డితో మాట్లాడారు.

హామీల అమలులో కూటమి వైఫల్యం

- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి
- నాయకులు, కార్యకర్తలతో సమావేశం



కార్యకర్తలతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పేరుతో అమలు సాధ్యం కాని హామీలిచ్చి నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా వైఫల్యం చెందిందని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త పాటుపడాలన్నారు. రానున్న కాలంలో వైఎస్సార్ సీపీకి ప్రజలు బ్రహ్మరథం పడతారన్నారు. మళ్లీ జగనన్నను సీఎంగా ప్రజా ప్రభుత్వం వస్తుందన్నారు. కక్ష సాధించమే కూటమి ఏజెండా అన్నారు. జగనన్న పాలనలో పేదలు, రైతులు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. నేడు కూటమి పాలనలో నిత్యావసర వస్తువులు, కరెంట్ చార్జీలు, డిజిల్, పెట్రోల్ ధరలు చుక్కలంటుతున్నాయన్నారు. ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. మళ్లీ జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంతో వర్ధిల్లుతుందన్నారు. కార్యక్రమంలో అద్దంకి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాని రాధకృష్ణమూర్తి, కొరిశపాడు, పంగులూరు మండల కన్వీనర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బల్లికురవలో 14న ప్రతిష్ఠ మహోత్సవాలు



తుది దశకు చేరిన మందిర నిర్మాణ పనులు

బల్లికురవ: బల్లికురవలో కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి శంకునామాలు, చక్రం, పాదాల ఏర్పాటుకు సంబంధించి మందిర నిర్మాణ పనులు తుదిదశకు చేరాయి. బల్లికురవలో వివాహాది శుభ కార్యక్రమాలు చేసుకునేందుకు వెంకటేశ్వర స్వామి శంకుచక్ర పాదాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 10 పదో తేదీన స్థానిక పోలేరమ్మ ఆలయానికి దక్షిణ భాగంలో మందిరం నిర్మాణానికి భూమి పూజతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామస్తుల సమష్టి కృషితో సుమారు రూ.10 లక్షల అంచనాలతో పనులు తుదిదశకు చేరాయి. ఈనెల 14వ తేదీ ఉదయం వేద పండితులచే ప్రతిష్ఠ మహోత్సవాలు, అన్నసంతర్పణ చేపట్టనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వేదమంత్రోచ్చరణ మధ్య జరిగే వేడుకల్లో గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నారు.

మత సామరస్యాన్ని చాటిచెప్పేందుకే యాత్ర



కారంచేడుకు పాదయాత్రగా వెళ్తున్న క్రైస్తవులు

చీరాల రూరల్: మత సామస్యాన్ని చాటిచెప్పేందేకు.. క్రైస్తవులను ఐక్యంగా నిలిపేందుకు శ్రమలకాల శిలువ పాదయాత్ర చేపడుతున్నట్లు ఫాదర్ జగస్ పేర్కొన్నారు. క్రైస్తవులందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో ఆచరించే ఉపవాస దినాలను పురస్కరించుకుని సోమవారం స్థానిక మరియమ్మపేటలోని పునీత ఆంథోని చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు పాదయాత్ర నిర్వహించారు. ఈయాత్ర మరియమ్మపేట చర్చి నుంచి ప్రారంభమై కారంచేడులోని లూర్థుమాత దేవాలయం వరకు కొనసాగింది. ఈ యాత్రలో భక్తులందరూ శిలువను మోస్తూ లోక రక్షకుడు ఏసుక్రీస్తు, పాపులను రక్షణ కోసం శిలువలో విడిచిన ప్రాణత్యాగం పాస్టర్లు వివరిస్తు ప్రార్థనలు చేస్తు యాత్రను ముగించారు. చర్చి ఫాదర్లు సందీప్, డేవిడ్‌లు దేవుని వాక్య సందేశాలు అందించారు. కార్యక్రమంలో చర్చి పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలి



మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేస్తున్న క్రైస్తవులు

అద్దంకి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై నిజాల నిగ్గు తేల్చాలని క్రైస్తవులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. నియోజవర్గ పాస్టర్ సంఘం తరుపున అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. పట్టణంలోని రామ్‌గనర్ నుంచి బంగ్లా రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ బొమ్మ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి కేసులోని నిజానిజాలను వెలికి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ భాస్కర్, ఏ బర్నబాస్, కే రామారావు, సీహెచ్ షడ్రక్, రమేశ్ గాంధీ, యేన, శ్యామ్, ఇశ్రాయేలు, పాపారావు, ఎం ఆనందరావు, నిరీక్షణ ప్రసాద్, ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేశ్‌బాబు, ఆర్టీసీ ఎస్సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా కాంతారావు, బీఎస్పీ ఇన్‌చార్జి మందా జోసెఫ్, బీటీఏ కార్యదర్శి జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి, తదితరులు పాస్టర్లు పాల్గొన్నారు.

పాడిరైతులకు బోనస్ పంపిణీ

బల్లికురవ: కృష్ణా పాల ఉత్పత్తిదారుల సంఘం బోనస్‌లు సకాలంలో పంపిణీతో పాడి రైతులను ఆదుకోవడం అభినందనీయమని ముక్తేశ్వరం పాల ఉత్పత్తి దారుల సంఘ సభ్యులు అన్నారు. సోమవారం పాల ఉత్పత్తిదారుల సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. 2024–25 సంవత్సరానికి మూడు విడతల్లో సభ్యులకు సుమారు రూ.18 కోట్ల మేర బోనస్‌లు అందజేయడం సంతోషం వ్యక్తం చేశారు. కృష్ణా మిల్క్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.



నాగేంద్రం మృతదేహానికి నివాళులర్పిస్తున్న చిన హనిమిరెడ్డి

వైఎస్సార్ సీపీ నాయకులకు నివాళులు

అద్దంకి: ఇటీవల మండల కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి తల్లి అనారోగ్యంతో మృతిచెందింది. సోమవారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి చిన్నకొత్తపల్లిలోని ఆయన గృహానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు, మండల నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

కొరిశపాడు సర్పంచ్‌కు సతీ వియోగం..

మేదరమెట్ల: మండల కేంద్రం కొరిశపాడు గ్రామ సర్పంచ్ ఈపూరి విజయకుమార్ సతీమణి నాగేంద్రం సోమవారం మృతి చెందింది. నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి హాజరై నాగేంద్రం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి విజయకుమార్‌ను ఓదార్చారు. హనిమిరెడ్డి వెంట గ్రామ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మండల కన్వీనర్‌ను పరామర్శిస్తున్న పానెం